క్లుప్తంగా

నేడు మధునపోచమ్మ బోనాలు



గ్రామదేవతలతో గోదావరి స్నానాలకు వెళ్తున్న భక్తులు

వేమనపల్లి: మండల కేంద్రంలోని జాలరివాడలో మధునపోచమ్మ దేవస్థానం వద్ద సోమవారం బోనాల జాతర ప్రారంభం కానుంది. జాలరులు ఆదివారం మధునపోచమ్మతో పాటు గ్రామదేవతలను చెన్నూర్ గోదావరి నదికి పుణ్యస్నానాలకు తరలించారు. శివసత్తుల పూనకాలు, ఒగ్గుకథకుల వాయిద్యాలతో గ్రామానికి చెందిన జాలర్లు తరలివెళ్లారు. బోనాల జాతరకు ఇల్లారి వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు.

లంబాడిపల్లిలో స్టడీ సెంటర్ ప్రారంభం

చెన్నూర్‌రూరల్: మండలంలోని లంబాడిపల్లి గ్రామంలో నగావత్ మహేష్ నాయక్ ఆధ్వర్యంలో పరిసర ప్రాంత విద్యార్థుల కోసం ఆదివారం భీమానాయక్ స్టడీ సెంటర్‌ను ప్రారంభించారు. నాలుగో, ఆరో తరగతి విద్యార్థులకు నవోదయ, గురుకులాల్లో చేరేందుకు గాను కోచింగ్ ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, మద్ద మధు, శ్రావణ్‌రెడ్డి, పరమేష్ పాల్గొన్నారు.

రేపు సీఎం కప్ మండల స్థాయి క్రీడాపోటీలు

బెల్లంపల్లి(తాండూర్): సీఎం కప్ తాండూర్ మండల స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోటీలు జరుగుతాయని తెలిపారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ విభాగాల్లో క్రీడా పోటీలు ఉంటాయని ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 9వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం 98499 98661, 98492 34865 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నూతన కార్యవర్గం

పాతమంచిర్యాల: అంబేడ్కర్ సంక్షేమ సంఘం మంచిర్యాల పట్టణ కార్యవర్గం ఎన్నికలు జిల్లా కేంద్రంలోని సంజీవయ్యకాలనీలో నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడిగా కలగూర లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా దుర్గం స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సాగే మోహన్, ఉపాధ్యక్షులుగా నేరేళ్ల శంకర్, జుమ్మిడి గోపాల్, కోశాధికారిగా పి.రవి, అధికార ప్రతినిధిగా కుంటాల శంకర్, గౌరవ అధ్యక్షులుగా గడ్డం సత్యం, దుర్గం రాజేష్, కాటం రాజేష్, ముఖ్య సలహాదారుగా రామగిరి బానేష్, గొడిశెల దశరథంలను ఎన్నుకున్నారు.

నియామకం

పాతమంచిర్యాల: బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కన్వీనర్‌గా పట్టణానికి చెందిన వడ్డేపల్లి మనోహర్‌ను నియమిస్తున్నట్లు బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

తాగుబోతుల వీరంగం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో తాగుబోతులు ఆదివారం రాత్రి వీరంగం చేశారు. కెమికల్ ప్రాంతంలోని జాతీయ రహదారిపై చిత్తుగా తాగిన యువకులు డబ్బుల విషయంలో గొడవపడి దాడి చేసుకున్నట్లు సమాచారం. రియల్ ఎస్టేట్ డబ్బుల విషయంలో మద్యం మత్తులో ఘర్షణ పడి అఖిల్, రాజు అనే యువకులు సంతోష్ అనే యువకుడిపై కత్తి, బీరుసీసా పగులగొట్టి దాడి చేసినట్లు తెలుస్తోంది. సంతోష్‌కు గాయాలు కాగా మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

భీమిని: కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌లో ఫాతిమా కాన్వెంట్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన నేషనల్ లెవల్ కరాటే పోటీల్లో గుప్తా ప్రైవేటు పాఠశాల విద్యార్థులు 16 మంది ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లాలోని కోటపల్లి మండలం బోరంపల్లిలో జనవరి 3న నిర్వహించే బహుజనుల జ్ఞాన జాతరను విజయవంతం చేయాలని బహుజనుల జ్ఞాన జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు గోమాస రాజమల్లు అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం జాతర పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మోహన్, నేతకాని సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



కంకర పోసి వదిలేసిన కంచరబాయి రోడ్డు



అసంపూర్తిగా నర్సాపూర్-ద్వారక రోడ్డు



లింగన్నపేట పార్‌పల్లి మధ్య రోడ్డు దుస్థితి

అధ్వానంగా రోడ్లు..!

- కంకరతేలి, గుంతలమయంగా మారిన రహదారులు
- ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పిన్నారం గ్రామంలో కంకర తెలిన బీటీ రోడ్డు



పార్‌పల్లి పిన్నారం గ్రామాల వెళ్లేదారిలో గుంతలమయంగా రోడ్డు

దండేపల్లి/కోటపల్లి: రోడ్లు గుంతలమయంగా మారి అధ్వానంగా మారాయి. నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారుల్లో సైతం అడుగడుగునా గుంతలే దర్శనమిస్తున్నాయి. రాత్రి సమయాల్లో ఎత్తుపల్లాలుగా మారిన రోడ్లపై ఏర్పడిన గుంతలు కనిపించక వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై ఏర్పడిన గుంతలు వర్షపు నీటితో నిండి ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల కేంద్రాల నుంచి పలు గ్రామాలకు ఉన్న మట్టి రోడ్లను గతంలో బీటీ రోడ్లుగా మార్చారు. కొన్ని ఏళ్లుగా ఈ రోడ్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో అధ్వానంగా మారిన రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. దండేపల్లి మండలంలో బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రెండేళ్లు, నాలుగేళ్ల క్రితం పనులను ప్రారంభించినా, ఇంకా పూర్తికావడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అసంపూర్తి రోడ్డు పనులు పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..

కోటపల్లి మండల కేంద్రం నుంచి పార్‌పల్లి వరకు బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. గుంతలమయంగా మారిన రోడ్డుపై ప్రయాణించలేక ఇబ్బందులు పడుతున్నాం. దెబ్బతిన్న రోడ్లుకు మరమ్మతు చేపట్టడంతో పాటు ప్రమాదసూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– రాజేందర్, ఎసన్‌వాయి, కోటపల్లి మండలం

బిల్లులు రాకపోవడంతోనే..

పంచాయతీరాజ్ నిధులతో చేపడుతున్న దండేపల్లి మండలంలోని నర్సాపూర్-ద్వారక, లింగాపూర్-గుడిరేవు బీటీ రెన్యూవల్ పనులకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు పనులు నిలిపివేశాడు. త్వరలో పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.

– సుబ్బారెడ్డి, పీఆర్ డీఈ

నిధులు మంజూరు కాగానే...

కోటపల్లి మండలకేంద్రం నుంచి పార్‌పల్లి వరకు బీటీ రోడ్డుకు ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు అందజేశాం. నిధులు మంజూరు కాగానే రోడ్డు పనులు ప్రారంభిస్తాం.

– భరత్, ఆర్‌అండ్‌బీ ఏఈ

జర్నలిస్టుల సమస్యలపై పోరాడతాం

- ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ



మాట్లాడుతున్న అల్లం నారాయణ

మంచిర్యాలటౌన్: జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. మంచిర్యాలలోని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు(హెచ్143) సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో 16వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్లు ఇవ్వగా, ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తరువాత 23 వేల మందికి అక్రిడిటేషన్లు ఇచ్చామన్నారు. జర్నలిస్టులతోపాటు, డెస్కులో పనిచేస్తున్న వారికి అక్రిడిటేషన్లు ఇచ్చినట్లు తెలిపారు. మృతి చెందిన 400మంది జర్నలిస్టు కుటుంబాలను ఆదుకున్నామన్నారు. రూ.లక్ష పరిహారం, పిల్లల చదువు కోసం రూ.వెయ్యి పింఛన్ మంజూరు చేశామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 59 నియోజకవర్గాల్లోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించామని గుర్తుచేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చినట్లుగానే జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు ఇవ్వడంతోపాటు, కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేలా చూశామన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ ఉమేశ్, కోకన్వీనర్లు చెట్ల రమేశ్, రేణిగుంట శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు మునీర్ పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానంతో విద్యార్థులకు నష్టం



మాట్లాడుతున్న వెంకట్

బెల్లంపల్లి: జాతీయ నూతన విద్యావిధానం విద్యార్థులకు నష్టదాయకమని, దీనిని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి తాపీ సంఘ భవనంలో యూనియన్ జిల్లా ఐదో మహాసభ ఆదివారం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జి.చక్రపాణి అధ్యక్షత వహించిన ఈ మహాసభకు ముఖ్య అతిథిగా వెంకట్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై టీఎస్ యూటీఎఫ్ అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు. దశాబ్దాల నుంచి పోరాడుతున్న తమ సంఘానికి ఉపాధ్యాయవర్గంలో ప్రత్యేకస్థానం ఉందన్నారు. తమ సంఘం సామాజిక స్పృహతో ముందుకు సాగుతూ ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు పాటుపడుతోందని గుర్తుచేశారు. గురుకులాలు, కస్తూరిబా విద్యాలయాల్లో ఎంటీఎస్ విధానం అమలు చేయాలని కోరారు. విద్యారంగాన్ని అభివృద్ధికి తగినన్ని నిధుల కేటాయింపులో ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. విద్యారంగానికి కనిష్టంగా 30 శాతం నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయడానికి ప్రభుత్వం నడుం బిగించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం సరైన దృక్పథం లేకుండా విద్యారంగంలో మార్పులు చేస్తోందని ఆరోపించారు. కామన్ విద్యా విధానం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధమని ప్రకటించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శులు శాంతకుమారి, శ్రీధర్ మాట్లాడుతూ విద్య ప్రైవేటీకరణకు చేస్తున్న యత్నాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మహాసభలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేశ్, జయకృష్ణ, ఉద్యోగుల సామాజిక న్యాయవేదిక జిల్లా అధ్యక్షుడు రాజేశం, ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ కరీంనగర్ డివిజన్ సెక్రెటరీ రాందాస్, యూటీఎఫ్ జిల్లా నాయకులు కిరణ్, నర్సయ్య, లావణ్య, బబిత తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చడం సరికాదు

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



క్షీరాభిషేకం చేస్తున్న దివాకర్‌రావు, నాయకులు

నస్పూర్: తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమ కాలంలో ఎందరో ఉద్యమకారులను చైతన్యవంతం చేసిన తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలను మార్చడం సరికాదని మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు అన్నారు. విగ్రహ రూపురేఖలను మార్చడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులతో కలిసి దివాకర్‌రావు పట్టణ పరిధిలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి కేసీఆర్ నేతృత్వంలో రూపకల్పన చేసి ఊరూరా తెలంగాణ తల్లి విగ్రహాలను నెలకొల్పామన్నారు. దీంతో మహిళలు ఉత్సాహవంతులై ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించి ప్రభుత్వ లోగోలు, ఆలయాల పేర్లు మార్పు, విగ్రహాల రూపురేఖలు మార్చడంలో నిమగ్నమైందని విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్పు ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, రాష్ట్ర నాయకులు విజిత్ రావు, కౌన్సిలర్లు వంగ తిరుపతి, బేర సత్యనారాయణ, కుర్మిల్ల అన్నపూర్ణ, నాయకులు కందుల ప్రశాంత్, మేరుగు పవన్, మల్లెత్తుల రాజేంద్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేను విమర్శించడం సిగ్గుచేటు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి: పదేళ్ల అధికారంలో ఉండి ఏమాత్రం అభివృద్ధి చేయని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కాంగ్రెస్ ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను విమర్శించడం సిగ్గుచేటని బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య అన్నారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి తప్పా, చిన్నయ్య ఏలుబడిలో బెల్లంపల్లి ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేకపోయిందన్నారు. రాజకీయాల్లో మచ్చలేని ఎమ్మెల్యే వినోద్‌పై చేస్తున్న విమర్శలు పూర్తిగా నిరాధారమని కొట్టిపారేశారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంఏ.నయీమ్, సీనియర్ నాయకులు గెల్లి జయరాం, బండి ప్రభాకర్, మునిమంద రమేష్, రొడ్డ శ్యామ్, కంకటి శ్రీనివాస్, దావ రమేష్, చిన్నరాజం, ఎండీ.ఓజియార్ పాల్గొన్నారు.

'శిక్షణ తరగతులు విజయవంతం చేయాలి'

పాతమంచిర్యాల: మందమర్రిలో జనవరి 5న నిర్వహించనున్న శిక్షణ తరగతులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా సమితి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరి ష్కారం కోసం తీసుకునే చర్యలపై సభ్యులకు అవగాహన, సమాన పనికి సమాన వేతనం, కనీస వేతన చట్టం, తదితర అంశాలపై అవగాహన, చర్చ కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు పోలు, సమ్మయ్య, మల్లేశ్, ఎస్కే బాజీసైదా తదితరులు పాల్గొన్నారు.

గురుచరిత్ర పారాయణం ప్రారంభం



గురుచరిత్ర పారాయణం చేస్తున్న వేద పండితులు

చెన్నూర్: స్థానిక శివాలయంలో లోక కళ్యాణార్థం ఆదివారం గురు చరిత్ర పారాయణాన్ని వేద పండితులు మహేశ్వర్‌శర్మ ప్రారంభించారు. వేదపండితులు మాట్లాడుతూ.. మార్గశిర మాసంలో ఏటా గురు చరిత్ర పారాయణం చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ నెల 14 దత్త జయంతి వరకు గురుచరిత్ర పారాయణం జరుగుతుందన్నారు. 15న ఉదయం పారాయణం ముగుస్తుందని, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. భక్తులు వారం రోజుల పాటు నిర్వహించే గురుచరిత్ర పారాయణ ప్రవచనాలకు హాజరై దత్తుని కృపకు పాత్రులు కాగలరని కోరారు. కార్యక్రమంలో గరు చరణ్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

కర్రంటు స్తంభం



దండేపల్లి: పంట పొలాల్లో వేలాడుతున్న వైర్లు సరిచేయకపోవడంతో, రైతులే కర్రస్తంభాలు ఏర్పాటు చేసుకొని లూజ్‌లైన్లు సరిచేసుకుంటున్నారు. దండేపల్లి మండలం లింగాపూర్ నుంచి గుడిరేవు వెళ్లే రోడ్డు పక్కన ఓ పంట పొలంలో ఇలా విద్యుత్ తీగలు వేలాడకుండా ఉండేందుకు కర్రస్తంభాన్ని ఏర్పాటు చేశారు.

యూత్ కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనం



ప్రేంసాగర్‌రావు దంపతులను సన్మానిస్తున్న అనిల్



వివేక్‌ను సన్మానిస్తున్న ఇలియాజుద్దీన్

కాసిపేట: మండలంలోని కొండాపూర్ యాప రైస్‌మిల్‌లో ఆదివారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేముల కృష్ణ ఆధ్వర్యంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రావుల అనిల్, బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు చల్లగొండ రాజ్‌కుమార్, కాసిపేట మండల అధ్యక్షుడు కనుకుల రాకేష్, బెల్లంపల్లి టౌన్ ప్రెసిడెంట్ సొప్పరి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు ఇమ్ము, జిల్లా కార్యదర్శులు భుక్య సాయి పున్నం, బోగ శ్రావణ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో బాల్‌మంచ్ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌బాబు, మైనార్టీ మండల అధ్యక్షుడు షాకీర్, యువజన కాంగ్రెస్ నాయకులు చారి, శ్రీనివాస్, రాజు, చిలుకయ్య, తిరుపతి పాల్గొన్నారు.

నస్పూర్: జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన రావుల అనిల్ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు, సురేఖ దంపతులను హైదరాబాద్‌లోని వారి నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారిని శాలువాతో సన్మానించారు.

ఎమ్మెల్యే వివేక్‌ను కలిసిన వైస్ ప్రెసిడెంట్ ఇలియాజుద్దీన్

జైపూర్: మండలంలోని ఇందారం గ్రామానికి చెందిన మొహమ్మద్ ఇలియాజుద్దీన్ చెన్నూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వైస్‌ప్రెసిడెంట్‌గా ఎన్నిక కాగా ఆదివారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేశారు.

అడవులపై అవగాహన అవసరం

జన్నారం: విద్యార్థి దశ నుంచే అడవులపై అవగాహన ఉంటే భవిష్యత్‌లో అడవుల రక్షణ బాధ్యతగా తీసుకుంటారని ఫారెస్ట్ రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ అన్నారు. జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని ఇంధన్‌పలి అటవీ రేంజ్‌లో ఆదివారం స్టడీ టూర్ నిర్వహించారు. జన్నారం మండలం కలమడుగు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు రేంజ్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్.. విద్యార్థులకు అడవులపై అవగాహన కల్పించారు. రేంజ్ పరిధిలోని ఇంధన్‌పల్లి బేస్ క్యాంపు, గనిశెట్టి కుంట, మైసమ్మకుంట, ప్రాంతాల్లో విద్యార్థులు ప్రయాణం చేసి అడవిలోని విశేషాలను తెలుసుకున్నారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి రవి, బీట్ అధికారి ముజీబొద్దిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్డిగాండ్ల సంక్షేమానికి కృషి

- రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి



నూతన కార్యవర్గం

చెన్నూర్: రెడ్డి గాండ్ల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తానని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంతోషం గోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక శిశుమందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం రెడ్డిగాండ్ల రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రెడ్డిగాండ్ల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. అనంతరం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా సంతోషం గోపాల్‌రెడ్డి(దాంపూర్), గౌరవ అధ్యక్షుడిగా వెన్నపురెడ్డి రవీందర్‌రెడ్డి(కాళేశ్వరం), ముఖ్య సలహాదారులుగా గొడిసెల బాపురెడ్డి, పోటు సత్యనారాణరెడ్డి (చెన్నూర్), ప్రధాన కార్యదర్శిగా శనిగారం శ్రీనివాస్‌రెడ్డి (కాళేశ్వరం), కార్యదర్శిగా ముల్కల్ల తిరుపతిరెడ్డి(శంకరపురం), ఉపాధ్యక్షుడిగా సింగిరెడ్డి తిరుపతిరెడ్డి(అంగ్రాజుపల్లి), సంయుక్త కార్యదర్శిగా ఓడెటి తిరుపతిరెడ్డి (మంచిర్యాల), కోశాధికారిగా రత్న సత్యనారాయణరెడ్డి(చెన్నూర్), మీడియా కార్యదర్శులుగా బొమ్మ పోచిరెడ్డి (చెన్నూర్), పుప్పిరెడ్డి రాంచందర్‌రెడ్డి (నెన్నల)లు, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.



హాజీపూర్ శివారులో జాతీయ రహదారి పక్కన కోళ్ల వ్యర్థాలు

అమ్మో.. గ్రామసింహాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో పలు చికెన్ సెంటర్ల నిర్వాహకులు రోజూ కోళ్ల వ్యర్థాలను నేరుగా జాతీయ రహదారి పక్కనే ఇష్టారాజ్యంగా పడేస్తున్నారు. దాదాపు 30కి పైగా వీధి కుక్కలు కోళ్ల వ్యర్థాలను తింటూ జాతీయ రహదారిపై అటూ ఇటూ తిరుగుతూ జనాలను భయపెట్టిస్తున్నాయి. వాహనాల వెంటపడుతూ పరిగెత్తిస్తున్నాయి. ఈ క్రమంలో చాలా మంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు పట్టించుకొని చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



హాజీపూర్ శివారు జాతీయ రహదారిపై వీధి కుక్కల గుంపులు